వరుణా.. ముంచావుకదన్నా..

- పత్తిరైతును ముంచిన ముసురు
- బొల్లాపల్లి మండలంలో వంద ఎకరాలకు పైగా పత్తిపంట నష్టం
- వర్షపునీటితో ఉరకవేసిన పత్తి
- కన్నెత్తి చూడని వ్యవసాయాధికారులు
- లబోదిబోమంటున్న రైతులు



ఉరకవేసి ఎండిపోయిన పంట



వర్షం దెబ్బకు పాడైన పత్తి

బొల్లాపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు బొల్లాపల్లి, ఈపూరు మండలాలల్లో రైతులు సాగుచేస్తున్న పత్తిపంట పూర్తిగా దెబ్బతిన్నది. పొలాల్లో వర్షపునీరు నిలబడటంతో ఉరకవేసి ఎండిపోయింది. కొంతమేర పత్తి చేతి కొచ్చే దశలో తడసిపోయి పనికిరాకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. సుమారు 100 ఎకరాలకు పైగా పంట దెబ్బతినడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు అల్లాడుతున్నారు. బొల్లాపల్లి మండలం జయంతి రామపురం, రెడ్డిపాలెం, మేళ్లవాగు, గ్రామలతోపాటు ఈపూరు మండలంలో కూడా కొన్నిగ్రామాల్లో పంట నష్టం జరిగింది. ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పత్తి పంట చేతికందే దశలో పూర్తిగా పాడైయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జయంతి రామపురం, గ్రామానికి చెందిన మిరియాల పెదసైదయ్య, (మాజీ సర్పంచ్), చిన్నసైదయ్య, కె.అంజిరెడ్డి, తోకలమరోహర్ లకు చెందిన15 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగింది. అసలే గతంలో సాగు చేసిన పంటలకు, గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడుతున్న రైతులకు వర్షం రూపంలో తీవ్రనష్టం జరిగిందని అంటున్నారు. వర్షాలకు పంటదెబ్బతిని ఇబ్బందులు పడుతుంటే ఇంతవరకు ఏ అధికారి వచ్చి చూడలేదని రైతులు వాపోతున్నారు. కనీసం సూచనలు సలహాలు ఇచ్చే నాధుడే కరవైయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి ఆవేదనను ప్రజాప్రతినిధులు కానీ, స్థానిక అధికారులు కూడా పరిశీలించకపోవడం గమనార్హం. వ్యవసాయం, కష్టతరంగా మారిందని ఇప్పటికే లక్షల రూపా యలు పెట్టుబడిపెట్టి అప్పులపాలయ్యామని వాపో యారు. ఈ పంటకూడా చేతికి రాకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నష్టం అంచనావేసి రైతులకు నష్ట పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఈక్రాప్ నమోదు చేసేవారేరీ?

బొల్లాపల్లి మండలంలో రెడ్డిపాలెం, జయంతిరామపురం, మేళ్లవాగు, లాలిపురం, గ్రామాలతో పాటు పలుగ్రామాల్లో వందల ఎకరాల్లో పత్తిపంట వర్షాలకు దెబ్బతింది. కనీసం ఈక్రాప్ నమోదు చేసేవారే కరవయ్యారు. గతంలో రైతుభరోసా కేంద్రాలల్లో ఈక్రాప్ నమోదు చేసేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. కిసాన్‌మేళా వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు రైతులను ఆదుకుంటే మంచిది. లేనిపక్షంలో రైతుల తరపున నష్టపరిహారం కోసం ఉద్యమిస్తాం.

– భీమీబాయి, బొల్లాపల్లి జెడ్పీటీసీ.

త్వరలో పరిశీలిస్తాం

వర్షం వల్ల రైతులకు పంట నష్టం జరిగినట్టు ఇంకా మాదృష్టికి రాలేదు. త్వరలోనే సదరు పొలాలను పరిశీలించి నష్టపరిహారం అందజేస్తాం.

–సి.హెచ్ రవికుమార్
వినుకొండ వ్యవసాయ సంచాలకులు

పట్టణాభివృద్ధికి కృషి అభినందనీయం



చిలకలూరిపేట: పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్న మున్సిపల్ కమిషనర్‌కు అవార్డు లభించటం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కొనియాడారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకున్న మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబును సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సన్మానించారు. పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన పారిశుద్ధ్యం, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కమిషనర్ కృషి చేస్తున్నారని అభినందించారు. కమిషనర్‌తో పాటు అవార్డు అందుకున్న రెవెన్యూ ఆఫీసర్ సుబ్బారావుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, మేనేజర్ మోహిద్దీన్, ఏఈఈలు అన్సర్, అల్తాఫ్, మణి, శానిటరీ ఇన్స్పెక్టర్లు రమణారావు, సునీత సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ వినియోగదారుల న్యాయ సదస్సు

చిలకలూరిపేట: విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల న్యాయ సదస్సు మంగళవారం నిర్వహిస్తున్నట్లు గుంటూరు టౌన్-2 విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు తెలిపారు. పట్టణంలోని కృష్ణ మహల్ సమీపంలో ఉన్న సింగు ఫంక్షన్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ న్యాయ సదస్సు నిర్వహించబడుతుందన్నారు. చిలకలూరిపేట, యడ్లపాడు, గణపవరం, గుంటూరు టౌన్-2 డివిజన్ పరిధిలోని డోకిపర్రు, ఫిరంగిపురం, పత్తిపాడు, వట్టి చెరుకూరులకు సంబంధించిన విద్యుత్ సమస్యలు పరిష్కరించబడతాయన్నారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చు తగ్గులు, మీటర్ సమస్యలు, బిల్లింగ్, విద్యుత్ సరఫరాకు సంబంధించి అన్ని సమస్యలు రాత పూర్వకంగా ఇస్తే సత్వరమే పరిష్కరించబడతాయన్నారు. ఈ సదస్సులో విశ్రాంత జిల్లా న్యాయమూర్తి, విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ ఎస్.విక్టర్ ఇమానియేల్, సాంకేతిక సభ్యులు ఎస్.శ్రీనివాస్, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర్య సభ్యురాలు ఎ.సునీత, సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొని సమస్యలు పరిష్కరిస్తారని, ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మురుగు తొలగించారు!



సాక్షి ఎఫెక్ట్

వినుకొండ : పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రహరీ ఆనుకొని మురుగునీరు నిలబడి ఇబ్బందిగా మారడంతో ఈ నెల 17న ఇదేనా స్వచ్ఛ ఆంధ్ర అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు పాఠశాల ప్రహరీ ముందున్న మురుగుకాలువలను శుభ్రం చేశారు. అలాగే మురుగునీరు నిలబడకుండా పాఠశాలలో సంపులో నిల్వ చేసినట్లయితే నీరు బయటకు రాకుండా ఉంటుందని, ఈ మేరకు చర్యలు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ తెలిపారు.

యడ్లపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ నియామకం



యడ్లపాడు: మండలంలోని సందెపూడి గ్రామానికి చెందిన మద్దినేని వెంకట సుబ్బారావు ఐదవసారి సొసైటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. యడ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా మద్దినేని వెంకట సుబ్బారావు, సభ్యులుగా మిరియాల నాగేశ్వరరావు, యనగందుల వీరాంజనేయులు నియమితులైనట్లు వారు వెల్లడించారు. యడ్లపాడు సొసైటీ అధ్యక్షుడిగా గతంలో నాలుగు పర్యాయాలు పనిచేశామని, కూటమి ప్రభుత్వంలో ఐదోసారి ఎంపిక చేయడం సంతోషంగా ఉందని సుబ్బారావు తెలిపారు. సోమవారం స్థానిక సొసైటీలో వీరు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సొసైటీ సెక్రటరీ శ్రీనివాసరావు, సిబ్బంది, టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ తీగలు తొలగించాలి



వినుకొండ: విఠంరాజుపల్లి, బ్రాహ్మణపల్లి ఎన్ఎస్‌పీ కాలువపై కరెంటు స్తంభం తీగలు ఉండటం వలన ప్రమాదం ఉందని, అడ్డంగా ఉన్న తీగలు తొలగించాలని రైతులు, ప్రజా సంఘాల నాయకులు స్థానిక తహసీల్దార్ సురేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో విద్యుత్ అధికారులకు అర్జీ ఇస్తే వచ్చి పరిశీలించి స్తంభం పడిపోకుండా రిపేరు చేయిస్తే తీగలు తొలగిస్తామని హామీ ఇచ్చారు. స్తంభం చుట్టు పక్కల రిపేర్ చేయించి విద్యుత్ అధికారులకు విషయం తెలియజేసినా స్పందించలేదన్నారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, పగడాల చిన్నకోటిరెడ్డి, కేశవరెడ్డి, చంద్రారెడ్డి, కంతా రంగారావు, వెంకటేశ్వర్లు, నిసంకి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రంగారెడ్డిపాలెం ఐక్యతను దెబ్బతీసే కుట్ర



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

- డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలోనే గ్రామాభివృద్ధి
- అభివృద్ధి పనుల్లో ఎలాంటి అవినీతి జరగలేదు
- మోసగాళ్లు చెప్పే మాటలు నమ్మవద్దు
- రంగారెడ్డిపాలెం గ్రామస్తులు

నరసరావుపేట రూరల్: గ్రామ ఐక్యతను దెబ్బతీసి అభివృద్ధిని అడ్డుకునే కుట్ర జరుగుతుందని రంగారెడ్డిపాలెం వాసులు తెలిపారు. గత 70 సంవత్సరాలుగా ఏ నాయకుడు గ్రామానికి సహాయం చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. మోసాలకు పాల్పడే వ్యక్తి చెప్పే మాటలు నమ్మవద్దని సూచించారు. గ్రామంలోని కల్యాణమండపం వద్ద గ్రామస్తులు సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిపై చేసిన ఆరోపణలపై వారు స్పందించారు. గ్రామంలోని వారు శుభాకార్యాలు నిర్వహించుకునేందుకు వేదిక లేకపోవడంతో వర్షా కాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామస్తులు అందరం కమిటీగా ఏర్పడి కల్యాణమండపం నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారని వివరించారు. గ్రామంలోని వారితో పాటు ఉద్యోగాలు, వ్యాపారాలలో బయట ప్రాంతాల్లో ఉన్న వారు, ఎన్ఆర్ఐలు కూడా చందాలు ఇచ్చారని తెలిపారు. గ్రామానికి చెందిన దొండెటి అచ్చిరెడ్డి 30 సెంట్ల స్థలాన్ని కల్యాణ మండపానికి అందజేశారని పేర్కొన్నారు. దాదాపు రూ.70 లక్షలు చందాలు వచ్చాయని, మిగిలిన పనులకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని సహకారం కోరినట్టు తెలిపారు. సిమెంట్, ఇసుక, గ్రానైట్ రూపంలో డాక్టర్ గోపిరెడ్డి సహకారం అందించారని వివరించారు. ప్రభుత్వ భూమిని బీసీలు కొంతకాలంగా సాగు చేసుకుంటున్నారని, జగనన్న కాలనీ కోసం ఆ భూమిని సేకరించడం జరిగిందన్నారు. భూమిని ఇచ్చిన బీసీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. డాక్టర్ సహకారంతో రంగారెడ్డిపాలెం- ఇస్సపాలెం గ్రామాల మధ్య కాజ్‌వేను నిర్మించుకున్నామని వివరించారు. 200 సంవత్సరాల చరిత్ర ఉన్న రంగారెడ్డిపాలెంను గతంలో ఏ నాయకుడు పట్టించుకోలేదన్నారు. రంగారెడ్డిపాలెం గ్రామానికి ఉన్న మంచి పేరు ఉందని, ఈ రోజు కొందరి వల్ల ప్రతిష్ట దెబ్బతినే పరిస్థితి వచ్చిందన్నారు.

గ్రామంలోని అభివృద్ధి పనులపై ఆరోపణలు చేసిన వెంకటేశ్వరరెడ్డి చరిత్ర అందరికి తెలుసన్నారు. నిరుద్యోగులను, ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని ఎంతో మందిని మోసం చేసి కేసులు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. గ్రామస్తులందరం వెంకటేశ్వరరెడ్డి ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

అడుగుకో గుంత - తీరదు చింత!

- వినుకొండ- నూజెండ్ల రహదారి అధ్వానం
- ప్రయాణించాలంటే నరకమే



గుంతల మయంగా రహదారి

నూజెండ్ల: వినుకొండ నుంచి మండల కేంద్రమైన నూజెండ్లకు వచ్చే రహదారి గుంతల మయంగా మారింది. అడుగుకో గుంతతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. గురప్పనాయుడు పాలెం నుండి మండల కేంద్రం వరకూ ఉన్న మూడు కిలోమీటర్ల రహదారి ప్రమాణం మరింత దారుణంగా మారింది. నూజెండ్లకు ప్రధాన రహదారి కావటం, ప్రకాశం జిల్లా దరిశి, అద్దంకికి ఇదే మార్గం గుండా వెళ్లాల్సి ఉండటంతో నిత్యం ఆటోలు, లా రీలు, భారీ వాహనాలు వందల సంఖ్యలో ఈ దారి గుండానే ప్రయాణిస్తూ ఉంటాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. ద్విచక్ర వాహనదారులు రాత్రివేళల్లో గుంత లు కన్పించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆటోల పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. బాడుగలకు వచ్చిన కిరాయి డబ్బులు ఆటోల రిపేర్లకే సరిపోతున్నాయని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తాత్కాలిక మరమ్మతులు కొంత మేరకు చేపట్టినప్పటికీ తిరిగి రహదారి యదాస్థితికి వచ్చిందని వాహనదారులు అంటున్నారు. అధ్వాన రహదారితో వాహనాలు తరచూ మరమ్మతులకు గురి అవుతున్నాయని వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వస్తున్న డబ్బులు రిపేర్లకు పెడుతున్నాం



గ్రామంలో 30 ఆటోల వరకూ ఉన్నాయి. పై గ్రామాల నుండి మరికొన్ని ఆటోలు నిత్యం వినుకొండకు వెళ్ళి వస్తూంటాయి. రహదారి గుంతలు మయం కావటంతో 20 నిమిషాల్లో వెళ్ళాల్సిన ప్రయాణం 40 నిమిషాల వరకూ పడుతుంది. రహదారి అస్తవ్యస్తంగా ఉండటంతో వాహనాలు మరమ్మత్తులకు గురి అవుతున్నాయి. డీజిల్ ఖర్చు పెరగటం, ఆటో రిపేర్లకే వచ్చిన బాడుగ డబ్బులు సరిపోతున్నాయి.

–ఫణిదపు శివ, ఆటో డ్రైవర్, నూజెండ్ల

గుత్తేదారు పనులు మొదలు పెట్టాల్సి ఉంది

వినుకొండ నుంచి నూజెండ్ల వరకూ రహదారి మరమ్మతులకు కోటి రూపాయల నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తయ్యాయి త్వరలో గుత్తేదారు పనులు మొదలు పెట్టాల్సి ఉంది. గురప్పనాయుడు పాలెం నుంచి నూజెండ్ల వరకూ 2 కిలో మీటర్ల రహదారి పూర్తిస్థాయిలో తారు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. మిగిలిన చోట్ల తాత్కాలిక మరమ్మతులు చేపట్టనున్నాం. త్వరలో పనులు పనులు ప్రారంభిస్తారు.

–నవ్య, ఏఈ, ఆర్అండ్‌బీ

చలో కరేడును అడ్డుకోవడం అప్రజాస్వామ్యం

నరసరావుపేట: నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో రైతుల నుంచి బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా సోమవారం రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల సంయుక్త పిలుపు మేరకు తలపెట్టిన సభను అనుమతి లేదంటూ సెక్షన్ 144, సెక్షన్ 30 అమలులో ఉందంటూ అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యతిరేకమని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ విమర్శించారు. ఈ మేరకు జిల్లా కార్యాలయం నుంచి సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుల వద్ద నుంచి భూములు బలవంతంగా గుంజుకుంటుందనే విషయం చలో కరేడు సందర్భంగా జరిగిన అక్రమ అరెస్టులు విదితం చేస్తున్నాయని పేర్కొన్నారు. పోలీసులు కరేడు గ్రామాన్ని తమ గుప్పెట్లోకి తీసుకుని బయట వ్యక్తులు రాకుండా గ్రామంలోకి వెళ్లే అన్ని మార్గాలను మూసివేయడం, వాహనాలను తనిఖీ చేయడం, గ్రామ సచివాలయాల వద్ద, ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు సాధారణ వ్యక్తుల మాదిరి తిరుగుతూ ప్రజల కదలికలపై నిఘా ఉంచడం ప్రజా స్వేచ్ఛను హరించడమేనన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు, ప్రజా సంఘాలు తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం ఉన్నప్పటికీ ఎన్డీఏ కూటమిలో భాగమైన బీజేపీ నిరంకుశ పోకడలకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కరేడు రైతుల అభిప్రాయాలను గౌరవించి బలవంతంగా భూములు సేకరించాలానే ఆలోచన విరమించుకోవాలని, అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బలవంతంగా భూ సేకరణ చేయాలని చుస్తే కరేడు రైతులకు అండగా నిలిచి రైతులను ఏకం చేసి రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కృష్ణ కృష్ణ హరేహరే..



విప్పర్ల గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక విప్పర్ల, చిలకలూరిపేట ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ భగవానుని ఉత్సవ మూర్తి ఊరేగింపు కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 16వ తేదీన శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ భగవానుని ప్రతిమలను కొలువు తీర్చి మూడు రోజుల పాటు నిత్య పూజలు చేశారు. ఊరేగింపు కార్యక్రమం విప్పర్లలోని జెండా చెట్టు వద్ద ప్రారంభమై ప్రధాన వీధులలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక విప్పర్ల, చిలకలూరిపేట కమిటీ అధ్యక్షుడు, సభ్యులు యద్దనపూడి వీరాంజనేయులు, రామాంజనేయులు, చిర్రా వెంకటరామిరెడ్డి, ఆకుల వెంకట్రావు, పి. గంగయ్య, వెంకటేశ్వరనాయక్, కృష్ణారెడ్డి, లక్ష్మీ, కోటేశ్వరమ్మ, వెంకటేష్, మద్దికుంట ఆంజనేయులు పాల్గొన్నారు.

–రొంపిచర్ల

పాఠశాలకు జిరాక్స్ మిషన్ అందజేత



వినుకొండ: రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో గల జడ్పీహెచ్ స్కూల్ నందు రోటరీ సభ్యులు గాండ్ల నాగేంద్రుడు సహకారంతో జిరాక్స్ మిషన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వీరప్పయ్య మాట్లాడుతూ పాఠశాలకు మౌలిక సదుపాయాలు సమకూర్చిన వారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నాగేంద్రుడును పలువురు అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వై.వి.నారాయణ, సెక్రటరీ ఎస్‌కే బాజీ, మాజీ అధ్యక్షులు గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కేబినేట్ సభ్యులు చిరుమామిళ్ల కోటేశ్వరరావు, ఆలా శ్రీనివాసరావు, గుత్తా గురునాథం, కూచి రామాంజనేయులు, ఎన్. పద్మజ, పీఈటీ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

చంద్రబాబు వరుస వైఫల్యాలతో రాష్ట్రం అధోగతి

నరసరావుపేట: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిపై అకారణ విద్వేషం, కక్ష పెంచుకున్న చంద్రబాబు కుట్రపూరితంగా పులివెందుల ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉపఎన్నికలు చేపట్టి ప్రజాస్వామ్య పాంచాలిని నిండు సమాజం సాక్షిగా చెరపట్టి పరాభవించిన వైనం సమీప భవిష్యత్తులోనే ఆయన పతనానికి నాంది కాబోతుందని సోషల్ యాక్టివిస్టు ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి



ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

నరసరావుపేట: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ప్రవేశద్వారం ఎదుట రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బీఎస్పీ నాయకులు ధర్నా నిర్వహించి పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని, బీసీలకు రాజ్యాధికారం బహుజన్ సమాజ్ పార్టీ ద్వారానే సాధ్యం అన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు కంభంపాటి నాగ వంశీ, వేల్పుల రాంబాబు, సత్తెనపల్లి అధ్యక్షులు దేవానంద్, కోటేశ్వరావు, మల్లేశ్వరరావు, చిలకలూరిపేట నాయకులు రమణయ్య, వందనం,షేక్ ఆదం సాహెబ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలవ కాదిది?



శావల్యాపురం బీసీ కాలనీ (వడియ రాజుల)లో ప్రధాన రహదారి మార్గంలో మురుగు కాల్వలు లేక మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. ప్రస్తుతం వర్షాకాలం సీజను కావటం చేత ఇక్కడ డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరురోడ్లపై ప్రవహిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ నెలలో డ్రెయినేజ్ నిర్మాణ పనులు మొత్తం పంచాయతీ తీర్మానం చేసి పరిపాలన ఆమోదం పొందింది. పనులు సంబంధించి అధికారుల నుంచి అనుమతి పత్రం కూడా అందినట్లు ఆరవ వార్డు సభ్యులు వేముల కోటి నారాయణ తెలిపారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం వలన ఈ దృష్టికి వచ్చినట్టు కాలనీవాసులు వాపోతున్నారు. గత రెండు నెలల క్రితం భూమి పూజ కార్యక్రమం కూడా అధికారులు ప్రజా ప్రతినిధులు సారథ్యంలో నిర్వహించారు. నేటి వరకు పనులు ప్రారంభం కాకపోవటంతో అధికారులు తీరుపై కాలనీవాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో డ్రెయినేజీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

–శావల్యాపురం

బస్సులు అరకొరా !





వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ఆగస్టు 15, కృష్ణాష్టమి, ఆదివారం వరుస సెలవులు రావడంతో సోమవారం జనం తిరుగు ప్రయాణం చేయడంతో బస్టాండ్ కిక్కిరిసి కనిపించింది. దీనికి తోడు ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినా తగినన్ని బస్సులు లేకపోవడంతో వచ్చిన బస్సుల్లో ఎక్కేందుకు ఎగబడుతున్నారు. తగినన్ని బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో, బస్సుల కోసం బస్టాండులో గంటల తరబడి వారంతా వేచి ఉండాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

–వినుకొండ

వెబ్‌ల్యాండ్‌లో సరిచేసుకోండి

యడ్లపాడు: సాంకేతిక సమస్యల వల్ల అన్నదాత సుఖీభవ పథకం నగదు రాని రైతులు వెబ్‌ల్యాండ్‌లో తమ వివరాలను సరిచేసుకునేందు కు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. రైతులు ఈ నెల 25వ తేదీలోగా సమీప గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూ చించారు.